ప్రజాశక్తి

బుధవారం 26 జులై 2023

5

అల్లూరి సీతారామరాజు

ఏజెన్సీలో ట్రైనీ కలెక్టర్ల బృందం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలో మంగళవారం 10మంది ట్రైనీ కలెక్టర్స్ బృందం పర్యటించింది. మొదట మోదాపల్లి గ్రామాన్ని సందర్శించి కాఫీ తోటలు చూశారు. అక్కడ ఆ గ్రామసభ్యులతో మాట్లాడారు. అక్కడ నుంచి వీడీవీకే మార్ట్‌ను సంద్శించారు. కలెక్టర్ బంగ్లాను సందర్శించి, కలెక్టర్‌తో ఇంటరాక్ట్ అయ్యారు. తర్వాత మోదకొండమ్మ గుడిని సందర్శించి, దర్శనం చేసుకున్నారు. డల్లపల్లి వ్యూ పాయింట్ సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్, అసిస్టెంట్ కలెక్టర్ అసుతోష్ శ్రీవాత్సవ, డిఆర్‌డిఎ పిడి వి.మురళి పాల్గొన్నారు.

కలెక్టర్, పిఒలతో ట్రైనీ కలెక్టర్లు

దోబూచులాడుతున్న గోదావరి, శబరి

తగ్గుతూ పెరుగుతున్న నీటి మట్టాలు

ప్రజాశక్తి-చింతూరు

అల్లూరి జిల్లాలోని చింతూరు డివిజన్ పరిధిలో శబరి, గోదావరి నదుల్లో వరద నీటి ప్రవాహం తగ్గుతూ, పెరుగుతూ దోబూచులాడుతోంది. ఎగువ రాష్ట్రాలైన చత్తీస్‌ఘడ్, ఒడిశా, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కురిసిన వర్షాలకు గోదావరి, శబరి నదుట నీటిమట్టాలు అమాంతంగా పెరిగాయి. గతవారం భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 45 అడుగులకు చేరి మళ్లీ 36 అడుగులకు తగ్గింది. తుఫాను కారణంగా ఎగువన కురుస్తున్న వర్షాలకు వరద నీరు గోదావరి చేరడంతో మంగళవారం మధ్యాహ్నం సమయానికి గోదావరి నీటి మట్టం 38.1 అడుగులకు చేరింది. చింతూరు వద్ద శబరి నది నీటిమట్టం కూడా సోమవారం 30 అడుగుల ఉండగా, క్రమంగా తగ్గుతూ సాయంత్రానికి 25 అడుగులకు చేరింది. మరల మంగళవారం ఉదయం క్రమంగా పెరుగుతూ 26 అడుగులకు వెళ్లింది. కొద్ది మేరకు వరద ప్రవాహం తగ్గడంతో మండలంలోని సోకులేరు వాగుపై పేరుకుపోయిన బురద మేటలను అధికారులు జెసిబి సాయంతో తొలగించారు. వరదల వల్ల ఆర్ అండ్ బి రహదారులు కోతకు గురై, ఛిద్రమయ్యాయి. మండల కేంద్రంలోని శబరికి ఆనుకొని ఉన్న ప్రజలు సురక్షిత ప్రాంతాలైనా ఎర్రంపేట, రత్నాపురం, పోతనపల్లి తదితర గ్రామాల్లో సామాన్లను భద్రపర్చుకొని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన తాత్కాలిక ఫ్లడ్ సెంటర్లలో తలదాచుకుంటున్నారు. శబరి నది ఒడ్డున ప్రస్తుతం రెండు బోట్లను ఏర్పాటు చేశారు.

అడవి వెంకన్న గూడెం వద్ద వరద ప్రవాహం తగ్గడంతో బ్రిడ్జిపైకి వచ్చి చేరిన కర్రలను తొలగిస్తున్న సిపిఎం శ్రేణులు

వరద ప్రవాహం తగ్గడంతో రోడ్డుపై పేరుకుపోయిన బురదను జెసిబితో తొలగిస్తున్న దృశ్యం

బ్రిడ్జిపై తిష్టవేసిన కలపను తొలగించిన సిపిఎం నేతలు

విఆర్.పురం : మండలంలోని గోదావరి వరద ప్రవాహం తగ్గడంతో అడవి వెంకన్నగూడెం-సుష్టివారి గూడెం మధ్యలో ఉన్న బ్రిడ్జిపై తిష్టవేసిన కలపను సిపిఎం నాయకులు మంగళవారం తొలగించారు. దీంతో నీరు కిందకు వెళ్ళటంతో రామవరం, వెంకన్న గూడెం, సుష్టివారిగూడెంతో పాటు సుమారు 10 గ్రామాల ప్రజలు రాకపోకలు వీలుకలిగింది. నిత్యావసర వస్తువులు తెచ్చుకోవడానికి వీలుగా ఉందని ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. సిపిఎం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

సీలేరు కాంప్లెక్స్ పరిధిలో అత్యధిక విద్యుత్ ఉత్పత్తి

ఎపి జెన్‌కో చీఫ్ ఇంజనీర్ శ్రీధర్

ప్రజాశక్తి -సీలేరు

ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్ పరిధిలో సోమవారం అత్యధిక విద్యుత్ ఉత్పత్తి చేసి పదేళ్ల రికార్డును అధిగమించినట్లు సీలేరు కాంప్లెక్స్ ఏపీ జెన్కో చీఫ్ ఇంజనీర్ బి.శ్రీధర్ వెల్లడించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో 4.8650 మిలియన్ యూనిట్లు, డొంకరాయి విద్యుత్ కేంద్రంలో 0.1775 మిలియన్ యూనిట్లు, సీలేరు జల విద్యుత్ కేంద్రంలో 2.1 మిలియన్ యూనిట్లు, మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో 2.8430 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేసినట్లు తెలిపారు. మొత్తం కలిపి ఒక్కరోజులో 9.9855 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేసి గత పదేళ్ల రికార్డును బద్దలుగొట్టామని పేర్కొన్నారు. సీలేరు కాంప్లెక్స్‌లో ప్రతిరోజూ 6 నుంచి 7 మిలియన్ యూనిట్లు విద్యుత్ మాత్రమే ఉత్పత్తి జరిగేదని, అటువంటిది 24 గంటల వ్యవధిలో అత్యధిక విద్యుత్ ఉత్పత్తి చేయడం ఇదే ప్రథమమని తెలిపారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల వలన విండు సోలార్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి కాకపోవడంతో లోడ్ డిస్పాచ్ ఆదేశాల మేరకు అత్యధిక విద్యుత్ ఉత్పత్తి చేయడం జరిగిందని చెప్పారు. ఏపీ జెన్కో ఇంజనీర్లు, కార్మికులు సమిష్టి కృషి, యూనిట్లు అన్ని కండిషన్లో ఉండడంతో గత రికార్డులను అధిగమించగలిగామని వెల్లడించారు. ఒక్కరోజులో రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి నెలకొల్పడం పట్ల ఏపీ జెన్కో డైరెక్టర్ ఎంవివి.సత్యనారాయణ ఇంజనీర్లను కార్మికులను అభినందించినట్లు ఆయన శ్రీధర్ తెలిపారు.

చీఫ్ ఇంజనీర్ శ్రీధర్

నిత్యావసరాలు అందించడంలో నిర్లక్ష్యం

అడవి వెంకన్నగూడెంలో సిపిఎం ఆధ్వర్యాన రాస్తారోకో

ప్రజాశక్తి -విఆర్.పురం

ముంపు గ్రామాల బాధితులకు నిత్యావసరాలు అందించడంతో ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్య వైఖరిపై మండలంలోని అడవి వెంకన్న గూడెం ప్రజలు మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. అడవి వెంకన్నగూడెం గ్రామాన్ని వారం పది రోజుల పాటు వరద చుట్టేయగా, ఇప్పటి వరకు ఆ గ్రామ ప్రజలకు ప్రభుత్వం నిత్యావసర సరుకులు అందించలేదని స్థానికులు వాపోయారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు మాట్లాడుతూ 10 రోజులుగా గ్రామ ప్రజలు ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రజలు వరదలకు ఇబ్బంది పడుతున్న ఈ ప్రాంత ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తమకు సంబంధం లేనట్టు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఎంపీపీ కారం లక్ష్మి మాట్లాడుతూ గత వరదల సమయంలో మంచి నూనె, కందిపప్పు, చింతపండు, బియ్యం, కూరగాయలు వంటి సరుకులు అందాయని, కాని ఈ సంవత్సరం ఏమీ ఇవ్వలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా వరద బాధితుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు మాని నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కారం సుందరయ్య, కారం ధర్మరాజు, కుంజా సుదీర్, కారం జగన్నాధం, తెల్లం నాగేష్, మడకం జానికిరావు, మడకం ధారమ్మ, బట్ట గణేష్, పైదా రాజు పాల్గొన్నారు.

అడవి వెంకన్న గూడెంలో రాస్తారోకో చేస్తున్న దృశ్యం

చొక్కనపల్లిలో నిరసన ..

విఆర్.పురం : మండలంలోని చొక్కనపల్లి వరద బాధిత గ్రామంలో సిపిఎం ఆధ్వర్యాన వరద బాధితుల సమస్యలను పరిష్కరించాలని నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ మాట్లాడుతూ ఇటీవల వరదలను పరిశీలించడానికి ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి వచ్చినా ఏ ఒక్క వరద బాధిత కుటుంబానికి ఇప్పటి వరకు నిత్యావసరాలు, బరకాలు ఇవ్వలేదని తెలిపారు. కొన్ని గ్రామాలకు కరెంటు లేక చిమ్మ చీకట్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుట్టలపై గుడారాలు వేసుకొనేందుకు తాటాకులు, బరకాలు లేక పలు అవస్థలను పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వరద బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు, కూరగాయలు, ఐదు లీటర్ల కిరోసిన్, బరకాలు అందించాలని, పునరావాస కేంద్రాలలో తలదాచుకుంటున్న వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు తోడం రాజు, గుండెపూడి లక్ష్మణరావు, వార్డు మెంబర్ గొంది ధారయ్య, మాజీ సర్పంచ్‌లు పులి సీతమ్మ, సోడి బూబామ్మ, శ్రీరామగిరి నాయకులు నేర్రి బోయిన రాజు, ఆత్మకూరు కాంతారావు, నల్లారపు చంద్రరావు, దారోగు బాబూరావు, చొక్కనపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

చొక్కనపల్లిలో ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు, గ్రామస్తులు

కొండరెడ్లకు అందని నిత్యావసరాలు

విఆర్.పురం : తుమ్మిలేరు పంచాయితీ పరిధిలోని తుమ్మిలేరు, కొండేపూడి, కొల్లూరు, గొందూరు, పోచవరం తదితర గ్రామాలకు వరదలు కారణంగా దారులు మూసుకుపోయాయని, ఆ గ్రామాల కొండరెడ్లకు నిత్యాసరాలు ఇవ్వకపోవడంతో వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని జీడిగుప్ప ఎంపిటిసి వాళ్ళ వెంకటేశ్వరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజుల నుండి వరదల్లో చిక్కుకొని మండల కేంద్రానికి రావడానికి వీల్లేని పరిస్థితుల్లో తీవ్ర ఇబ్బంది పడ్డారని తెలిపారు. కనీసం వారికి బరకాలు కూడా ఇవ్వలేదన్నారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే ముఖం చూపించి వెళ్లారు తప్పా ప్రజలు ఏమీ సహాయం చేయలేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రతి కుటుంబానికి కూరగాయలు, 5 లీటర్ల కిరోసిన్, 50 కిలోల బియ్యం, బరకాలు అందించాలని డిమాండ్ చేశారు.

తామరపల్లిలో జగనన్న సురక్ష

ప్రజాశక్తి - రంపచోడవరం

మండలంలోని తామరపల్లి సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఎంపీపీ, జడ్పీటీసి, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా ప్రభుత్వం ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ల, ఎంపీడీఓ, ఈఓపిఆర్‌డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై వినతి

ఎంఇఒకు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి -దుంబ్రిగుడ :మండలంలోని విద్య, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యుటిఎఫ్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.బాలకృష్ణ కోరారు. మంగళవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ఎంఇఒ సుందరరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ మండలంలో వివిధ పాఠశాలలో ఇటీవల జరిగిన బదిలీలు, ప్రమోషన్లలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలలకు ఏకోపాధ్యాయులు మాత్రమే ఉన్నారని, అటువంటి పాఠశాలల్లో ఉపాధ్యాయుల పని భారం తగ్గించుటకు వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేయాలని కోరారు. ఎంటిఎస్ ఉపాధ్యాయులకు జీతభత్యాలు త్వరగా చెల్లించాలని, విద్యార్థుల హాజరు యాప్‌కు సంబంధించి లీవ్ అప్‌డేషన్ సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిలర్ ఎస్ కన్నయ్య, గౌరవ అధ్యక్షులు టి సుబ్బారావు, కార్యదర్శి కె.బాబ్జి పాల్గొన్నారు.

ప్రసవాలపై ఆరా

జి.మాడుగుల పిహెచ్‌సిని కేంద్ర బృందం సందర్శన

రికార్డులను పరిశీలిస్తున్న కేంద్రబృందం ప్రతినిధులు

ప్రజాశక్తి -జిమాడుగుల : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఢిల్లీకి చెందిన నేషనల్ హెల్ప్ రీసెర్చ్ సెంటర్‌కు చెందిన ప్రత్యేక వైద్య బృందం మంగళవారం సందర్శించి, ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా ఢిల్లీ నుండి వచ్చిన డాక్టర్ ఎలాన్ గోవన్, డాక్టర్ నిమిత్ కుబావన్ పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు అక్కడ వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలు, గర్భిణులకు అందిస్తున్న సేవలపై ముఖ్యంగా ఆరా తీశారు. రోగులకు అందిస్తున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నాఉ. ఆరోగ్య కేంద్రం పరిసరాలను పరిశీలించారు. మన్యంలో రెండు రోజులు పాటు కొనసాగే కేంద్ర బృందం తనిఖీల్లో భాగంగా మొదటి రోజు ప్రశాంతంగా ముగిసిందని డాక్టర్ విఘ్నేష్ తెలిపారు. కార్యక్రమంలో పలువురు డాక్టర్లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు

పనులు చేయని కాంట్రాక్టర్లపై చర్యలు

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణాలకు ముందుగా అడ్వాన్సులు తీసుకుని పనులు చేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం జరిగితే చర్యలు తప్పవన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాడేరు డివిజన్ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో నేరుగాను, రంపచోడవరం డివిజన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లోను సమీక్షించారు. రైతు భరోసా కేంద్రాలు, వెల్నెస్ సెంటర్ల నిర్మాణపనుల పురోగతిపై సమీక్షించారు.

ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతూ పెండింగ్ బిల్లులుపై ఆరా తీసారు. భవన నిర్మాణాలు పూర్తి చేసిన వారికి వెంటనే ఆన్‌లైన్‌లో బిల్లులు పొందుపరచాలని ఆదేశించారు. చింతపల్లి, జి.మాడుగుల, అరకు వ్యాలీ మండలాల్లో అడ్వాన్సులు తీసుకుని, కాంట్రాక్టర్లు పనులు చేయడం లేదని ఇంజనీరింగ్ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అడ్వాన్సులు పొంది పనులు చేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని తహాశీల్దారులను ఆదేశించారు.

పూర్తైన భవనాలు సంబంధిత అధికారులకు అప్పగించాలని సూచించారు. విద్యుత్తు పరికరాలు, టైల్స్ కొనుగోలులో, నిర్మాణపు పనుల్లో నాణ్యతలు పాటించాలని సూచించారు. మండలాల వారీగా భవన నిర్మాణ స్థాయిలు అడిగి తెలుసుకుని వేగంగా పూర్తి చేయాలన్నారు. ఇసుక సమస్యను పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో రంపచోడవరం ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే, పంచాయతీరాజ్ (పిఐయు) ఇఇ కె.లావణ్యకుమార్, ఇఇ టి.కొండయ్య పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమశాఖ డిఇఇలు, ఎఇఇలు పాల్గొన్నారు.

మణిపూర్‌లో అకృత్యాలు అమానవీయం

ప్రజాశక్తి - పాడేరు టౌన్ : మణిపూర్‌లో అకృత్యాలకు అడ్డుకట్ట వేయాలని దండకారణ్య విమోచన సమితి (డిఎల్ఒ) జాతీయ అధ్యక్షుడు చెండా ఎలియా డిమాండ్ చేశారు. మంగళవారం పాడేరులో మణిపూర్ ఆదివాసీలపై దుర్మార్గపు చర్యలకు వ్యతిరేకంగా విలేకరులతో మాట్లాడుతూ, మణిపూర్‌లో సమాచార వ్యవస్తను స్తంభింపజేసి విచక్షణ రహితంగా ఆదివాసులపై దారుణ దాడులు చేయడం అమానుషమన్నారు. ఆదివాసీ మహిళలను వివస్త్రలను చేసి ఆఘాయిత్యాలకు పాల్పడడం, ఆదివాసీలపై మరణాయుధాలతో దాడులు చేస్తుంటే కేంద్ర, రాష్ట్ర పాలకులు చోద్యం చూస్తుండడం దారుణమని విమర్శించారు. దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని దుష్పరిణామాలు, దుర్మార్గాలు దేశంలోనూ, మణిపూర్‌లోనూ జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భూహక్కుల కోసం పోరాడుతున్న మణిపూర్, ఛత్తీస్‌గఢ్ ఆదివాసీలపై దాడులు, హతమారుస్తున్న ఘటనలు చూస్తుంటే, దేశంలోనే వారి మనుగడకు ముప్పు కలిగించేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు రూ.ఐదు కోట్ల నష్టపరిహారం చెల్లించాలని, దాడికి పాల్పడిన ప్రత్యక్ష, పరోక్ష నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలో. ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచేస్తామని ప్రగల్బాలు పలుకుతున్న ప్రధానమంత్రి నరేంద్రమోడీ, మణిపూర్‌లో అమానవీయ దాడులపై ఎందుకు దృష్టి పెట్టలేదని ప్రశ్నించారు. మణిపూర్‌లో ఆదివాసీలపై దాడుల వెనుక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్ర దాగి ఉందని, దీనికి బాద్యత వహించి తక్షణమే ప్రధాని మోడీ, మణిపూర్ ముఖ్యమంత్రి బీరెన్‌సింగ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డిఎల్ఒ రాష్ట్ర అధ్యక్షుడు పి.రంజిత్ కుమార్, డిఎస్ఒ రాష్ట్ర అధ్యక్షులు జాన్ బాబు, ఎపిసిఎల్ సి మాజీ కార్యదర్శి సుగునాదం పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఎల్ఒ జాతీయ అధ్యక్షులు ఎలియా

అడ్డతీగలలో నిరసన ర్యాలీ

అడ్డతీగల: మణిపూర్‌లో ఆదివాసీలు, మహిళలపై జరుగుతున్న దాడులు, హత్యలు, అత్యాచారాలు, గృహ దహనాలు, ఆస్తి నష్టాలు, హింసకు వ్యతిరేకంగా సాక్షి స్వచ్ఛంద సేవా సంస్థ కోఆర్డినేటర్ ఆరోగ్య రాజు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం మౌనంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక తహశీల్దారుకు వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా ఆరోగ్య రాజు మాట్లాడుతూ దేశంలో దళితులు, ఆదివాసీలు, మైనార్టీలు, మహిళలపై దాడులను ఖండించారు. ఈ కార్యక్రమంలో ఐజాక్ సామ్యూల్ రాజు, మిల్కీ సెదక్ మాణిక్యం, భూషణం ఆనందు, మణికుమార్, భాస్కర్, అమృత, లలిత కుమారి, ఇవాంజిలిన్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సంస్థ ఆధ్వర్యంలో అడ్డతీగలలో నిరసన ర్యాలీ

విద్యాసంస్థల బంద్ విజయవంతం

ముందుగానే సెలవు ప్రకటించిన ప్రైవేటు బడులు

సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలని, విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో మంగళవారం జరిగిన బంద్ విజయవంతమైంది. రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి పలు విద్యార్థి సంఘాలు విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో, విద్యార్థి సంఘాల అభ్యర్ధన మేరకు ముందుగానే పట్టణంలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, పాఠశాలలు స్వచ్ఛందంగా సెలవు ప్రకటించాయి. ఎఐఎస్ఎఫ్, టిఎన్ఎస్ఎఫ్, జిఎస్‌యు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఐటిడిఎ వరకు ర్యాలీగా వెళ్ళి ధర్నా చేశారు. కార్యాలయం లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన విద్యార్థులను ఐటిడిఎ గేట్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు.

ఈ సందర్భంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, నాణ్యమైన విద్య, మెనూ అందించాలని, మెస్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచాలని, పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఎన్ఇపి రద్దు చేయాలని, తరగతుల విలీనం ఆపాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు కె.రాజశేఖర్, సత్యనారాయణ, మాధవరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా, అణచివేత ధోరణితో వ్యవహరిస్తున్నాయంటూ ధ్వజమెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు గత ప్రభుత్వం ఉచితంగా అందించిన విధంగా పాఠ్య, నోటు పుస్తకాలు, స్టడీ మెటీరియల్స్ అందించాలని డిమాండ్ చేశారు. డిగ్రీ విద్యా విధానంలో ప్రవేశపెడుతున్న మేజర్, మైనర్ సబ్జెక్టు విధానాన్ని విరమించుకోవాలని కోరారు. విద్యను వ్యాపారం చేస్తున్న వైసిపి ప్రభుత్వవైఖరి విడనాడకుంటే ఐక్య పోరాటాల ద్వారా గట్టిగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న డిడి కార్యాలయం సూపరింటెండెంట్ భగీరధి విద్యార్థుల వద్దకు రావడంతో వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ఆయా విద్యార్థి సంఘాల నాయకులు నాగరాజు, ఆమోస్ అనిల్, రవిప్రసాద్, రాజశేఖర్, దేవదాస్, రామకష్ణ, ధానియేల్, ఉదయ్, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

4,328 ధ్రువపత్రాల పంపిణీ

- జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: జిల్లాలో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 4,328 దవపత్రాలు పంపిణీ చేసినట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఐదు మండలాల పరిధిలోని తొమ్మిది సచివాలయాల్లో జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. 8,149 గృహాల నుంచి వాలంటీర్ల యాప్‌లో వివిధ సర్టిఫికెట్ల కోసం 7,324 వినతులు రాగా, 10,004 టోకెన్లు నమోదు చేశామని, వాటిల్లో 8,534 దరఖాస్తులను ఆన్‌లైన్ చేసి, అందులో 4,328 సర్టిఫికెట్లు పంపిణీ చేశామన్నారు. 12 దరఖాస్తులు తిరస్కరించామన్నారు. మిగిలిన సర్టిఫికెట్లు రెండు, మూడు రోజుల్లో వాలంటీర్ల ద్వారా సంబంధిత లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని కలక్టర్ వివరించారు.

స్వామి వివేకానంద కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న సంచాలకులు విశ్వేశ్వరరావు

ఎయును సందర్శించిన స్వామి వివేకానంద కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని స్వామి వివేకానంద కుటుంబ సభ్యులు సందర్శించారు. స్వామి వివేకానంద పెదతండ్రి మనిమనవరాలు సంధ్య విశ్వాస్ ఏయూను విచ్చేశారు. ఆమె కుమార్తె మదురిం విశ్వాస్ ఏయూ దూరవిద్యా కేంద్రం నుండి పీజీ డిప్లమా ఇన్ మేనేజ్‌మెంట్ కోర్సును చేస్తున్నారు. ప్రస్తుతం పరీక్షలు జరుగుతుండడంతో తన ఇద్దరు కుమార్తెలతో కలిసి ఆమె విశాఖకు వచ్చారు. మంగళవారం పరీక్షలు ముగించుకుని వారు అంబేద్కర్ ఫూలేకి ప్రయాణమయ్యారు. సంధ్యావిశ్వాస్ ఇద్దరు కుమార్తెలు మదురిం విశ్వాస్, శ్యామ శ్రీత్ విశ్వాస్ ఏయూ దూర విద్య కేంద్రం నుంచి డిగ్రీలు పూర్తి చేశారు. ఈ సందర్భంగా సంధ్యా విశ్వాస్‌ను ఏయూ దూర విద్యా కేంద్రం సంచాలకులు ఆచార్య కె.విశ్వేశ్వరరావు సత్కరించారు.

ఉక్కు పరిరక్షణకు ఆమ్‌ఆద్మీ చలో ఢిల్లీ

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ రిలే నిరాహార దీక్షలు 900 రోజులకు సమీపిస్తున్న సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు సంఘీభావంగా చలో ఢిల్లీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆమ్ ఆద్మీ పార్టీ సభ్యులను స్టీల్‌ప్లాంట్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గతంలోనూ ఢిల్లీలో జరిగిన సమావేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ నేతలకు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ తరుపున వినతి పత్రాన్ని సమర్పించామని అయోధ్యరామ్ తెలిపారు. ఆమ్ ఆద్మీ పార్టీ తరుపున పార్లమెంట్లో ప్రశ్నించారని చెప్పారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీకి అండగా నిలబడి సంఘీభావంగా చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టడం సంతోషించదగ్గ విషయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు పోరాటానికి సంఘీభావం తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ నేతలు ఎస్.పవన్, సీర రమేష్, కెఎం.రాజు, శీతల్ మదన్ పాల్గొన్నారు.

'గంగవరం' సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -గాజువాక : అదానీ గంగవరం పోర్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ఉపాధ్యక్షులు కొవిరి అప్పలరాజు డిమాండ్ చేశారు. అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం మొండి వైఖరికి నిరసనగా నిర్వాసిత కార్మికులు చేపట్టిన నిరవధిక నిరసన దీక్షలు మంగళవారం నాటికి 22వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కొవిరి అప్పలరాజు మాట్లాడుతూ, కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లపై యాజమాన్యంతో పలుదఫాలు సంప్రదింపులు జరిపినప్పటికీ మొండిగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గంగవరం పోర్టులో షిప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ కింద మరో బోగస్ కంపెనీని యాజమాన్యం రిజిస్టేషన్ చేయించుకుని జెపిఎస్ పేరుతో కార్మికుల శ్రమను దోచుకుంటోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించుకొని సంప్రదింపులు ద్వారా కార్మికుల వేతనాలు పెరిగేలా కృషి చేయాలని కోరారు. 52 మంది కార్మికుల బృందం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలిసేందుకు విజయవాడ వెళ్లారని, వారికి అపాయింట్‌మెంట్ ఇప్పి కార్మికుల గోడు వినాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాసుపిల్లి యల్లాజి, కొవిరి అమ్మోరు, రాజారావు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి-బీచ్‌రోడ్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన ఆంధ్ర వైద్య కళాశాలలో విద్యార్థులకు ర్యాగింగ్ చట్టాలపై అవగాహన కల్పించారు. డిఎల్ఎస్ఎ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎంవి.శేషమ్మ మాట్లాడుతూ, ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టప్రకారం శిక్షార్హులని, అటువంటి ఘటనలకు పాల్పడి తమ బంగారు భవిష్యత్తులను నాశనం చేసుకోవద్దని వైద్య విద్యార్థులకు సూచించారు.

ముమ్మరంగా వరినాట్లు

కరకవలసలో నాట్లు వేస్తున్న మహిళలు

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు పొలాల్లో నీరు చేయడంతో దమ్ములు పట్టి, నాట్లు వేసే పనుల్లో రైతన్నలు నిమగ్నమై ఉన్నారు. పలు గ్రామాల్లో వరినాట్లు ఊపందుకుంటున్నాయి. వరితోపాటు చోడి, సామలు, జొన్నలు, గంటెలు, ఇతర చిరుధాన్యాల విత్తనాలు చల్లే పనిలో గిరిజన రైతులు బిజీగా మారారు. వరి పొలాల్లో దమ్ము పట్టడం, గట్లు బాగుచేయడం, నారు తీయడం నాట్లు వేయడం ఇలా ముమ్మర వ్యవసాయ పనుల్లో రోజంతా పొలాల్లోనే రైతులు కూలీలు కుటుంబాలతో ఉంటున్నారు. మండలంలోని24 పంచాయతీలలో 14 పంచాయతీలు అనంతగిరి, కొండిభ, టోకూరు, గుమ్మ, కొత్తూరు, ఎగువశోభ, వేంగడ, పైనంపాడు, పెద్దకోట, పినకోట, బొర్రా, లుంగపర్తి, వాలసి,పెద్దబిడ్డ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో రైతులు ఎక్కువగా వరి పంట సాగుపైనే ఆధారపడి ఉండగా, ఆయా గ్రామాల్లో ప్రస్తుతం ఖరీఫ్ పనులు జోరుగా సాగుతున్నాయి. ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నారు.

భారతీయ కళలు విశిష్టమైనవి

రెక్టార్ ఆచార్య కె.సమత

నృత్యకారిణి శ్రావణిని సత్కరిస్తున్న ఆచార్యులు సమత, కృష్ణమోహన్

ప్రజాశక్తి-విశాఖపట్నం : భారతీయ సంప్రదాయ కళలు ఎంతో విశిష్టమైనవని ఆంధ్ర విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. మంగళవారం ఉదయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో నిర్వహించిన ప్రవాస భారతీయులు చెల్లెపిళ్ల శ్రావణి శాస్త్రీయ నృత్య ప్రదర్శన అనంతరం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెక్టార్ ఆచార్య కె.సమత మాట్లాడుతూ, కళలపై ఉన్న మక్కువతో విదేశాల్లో ఉన్నప్పటికీ ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి కూచిపూడి నృత్యాన్ని అభ్యసించి, ప్రదర్శించడం గర్వకారణమన్నారు. బాల్యం నుంచి చిన్నారుల్లో ఉన్న ఆసక్తులను గుర్తించి వారిని తదనుగుణంగా తీర్చిదిద్దడం తల్లిదండ్రుల బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నృత్య కళాకారిణి శ్రావణి, ఆమె తల్లిదండ్రులను అభినందించారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ, వ్యక్తి సమగ్రాభివృద్ధికి, వికాసానికి కళలు దోహదపడతాయన్నారు. ఎంతో ఏకాగ్రత కలిగి ఉంటేనే ఇటువంటి సంప్రదాయ కళలను అభ్యసించడం సాధ్యపడుతుందని చెప్పారు. ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ, భారతీయ కళల ప్రత్యేకతను చాటి చెప్పే విధంగా శ్రావణి నృత్య ప్రదర్శన జరిగిందన్నారు. కార్యక్రమంలో సంగీత నృత్య విభాగాధిపతి ఆచార్య ఎ.అనురాధ, ఆచార్య సరస్వతి, విభాగ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శనలిస్తున్న శ్రావణి

సెప్టెంబర్ 28, 29న జాతీయ సదస్సు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం అణుభౌతిక శాస్త్రం, నేషనల్ అసోసియేషన్ ఫర్ అప్లికేషన్ ఆఫ్ రేడియో ఐసోటోప్స్ అండ్ రేడియేషన్ ఇన్ ఇండస్ట్రీ (నారీ) ముంబై సంయుక్తంగా సెప్టెంబర్ 28, 29 తేదీలలో జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ తెలిపారు. మంగళవారం ఏయు అకాడమిక్ సెనేట్ హాల్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రీసెంట్ ట్రెండ్స్ ఆన్ అప్లికేషన్స్ ఆఫ్ రేడియో ఐసోటోప్స్ అండ్ రేడియేషన్ టెక్నాలజీస్ అంశంపై ఏయూ వేదికగా ఈ సదస్సును నిర్వహిస్తున్నామని చెప్పారు. రేడియో ఐసోటోప్స్‌పై ప్రజలకు విస్తత అవగాహన కల్పించే విధంగా ఈ సదస్సు ఉంటుందన్నారు. నేడు వైద్య రంగంతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలలో సైతం రేడియో ఐసోటోప్ వినియోగం పెరిగిందని ఆయన తెలియజేశారు. రైతుల పంటలు, పండ్లు వంటి ఉత్పత్తుల నిల్వ సామర్థ్యం పెంచడానికి రేడియో ఐసోటోప్‌లు వినియోగిస్తున్నట్లు వివరించారు. నారీ జనరల్ సెక్రటరీ పిజె చాంది మాట్లాడుతూ, రేడియో ఐసోటోప్స్ సామాజిక ఆర్థిక-ఉపయోగాలను వివరిస్తామని వీటిని పరిశ్రమలుగా స్థాపన చేయడానికి గల అవకాశాలను తెలియజేస్తామని తెలిపారు. సదస్సు కన్వీనర్ ఆచార్య ఎ.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, ఏపీలో తొలిసారిగా ఈ అంశంపై సదస్సును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అణుభౌతిక శాస్త్ర విభాగాధిపతి ఆచార్య ఎ.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మృతి చెందిన గొర్రెలు

కుక్కల దాడిలో 12 గొర్రెలు మృత్యువాత

రూ1.50 లక్షల నష్టం : విలపిస్తున్న బాధితుడు

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని తాడేపుట్టు గ్రామంలో కుక్కల దాడిలో 12 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన రామన్న అనే పెంపకందారుని ఇంటి వద్ద పశువులశాలలో కట్టిన గొర్రెలపై ఆదివారం రాత్రి కుక్కల గుంపు దాడిచేసి కరవడంతో 12 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయని బాధిత పెంపకందారుడు ఆవేదన వ్యక్తం చేశారు. వీటి విలువ సుమారు రూ.1.50లక్షలు ఉంటుందన్నాడు. గొర్రెల మృతితో తన జీవనాధారం పోవడంతోపాటు ఆర్థికంగా నష్టపోయాయని, ప్రభుత్వపరంగా ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు. కాగా.విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ సొమెలి సత్యవతి సంఘటన స్థలానికి చేరుకొని రైతును పరామర్శించారు. ప్రమాదంజరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జరిగిన నష్టంపై వివరాలను సేకరించాలని పశు వైద్య సిబ్బందిని కోరారు. ప్రభుత్వం తరుపున బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలని సూచించారు. కాగా చనిపోయిన గొర్రెలలో ఐదింటికి బీమా సౌకర్యం ఉందని, మిగిలిన ఏడు గొర్రెలకు పశుసంవర్ధకశాఖ ద్వారా పరిహారం చెల్లించే ఏర్పాటు చేయాలని కోరారు.

విద్యుదాఘాతంతో పెయింటర్ మృతి

ప్రజాశక్తి -గాజువాక : విద్యుదాఘాతంతో పెయింటర్ మృతి చెందిన ఘటన శ్రీనగర్‌లో మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... స్పెన్సర్ సమీపంలోని అపార్ట్‌మెంట్‌లో పాపయ్య (45) నిర్మాణ పనులు చేస్తున్నారు. ఆ సమయంలో విద్యుత్ తీగలు తగలడంతో కింద పడిపోయాడు. దీంతో తలకు తీవ్ర గాయమే మృతిచెందాడు. గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భారీగా యానాం మద్యం పట్టివేత

ప్రజాశక్తి-ఎస్ రాయవరం : మండల కేంద్రమైన రాయవరంలో 18 కేసుల అంతర రాష్ట్ర మద్యాన్ని పట్టుకున్నట్లు నక్కపల్లి సిఐ అప్పన్నబాబు తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వివరాలను వెల్లడించారు. ఎస్ రాయవరం వెంకటేశ్వర స్వామి గుడి దగ్గరలో ఉన్న ఒక్క షెడ్‌లో అక్రమంగా మద్యం నిల్వ ఉంచి, వేర్వేరు గ్రామాలకు తరలిస్తున్నారని పక్కాగా అందిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారన్నారు. అక్కడ అనుమాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను ప్రశ్నించేలోగా పారిపోయేందుకు యత్నించగా పట్టుకుని ఆరా తీశామన్నారు. ఈసందర్భంగా యానాం నుంచి తెచ్చిన 18 బాక్సుల మద్యం బాటిళ్ళను స్వాధీనం పరుచుకున్నట్లు సిఐ అప్పన్నబాబు తెలిపారు. కేసు నమోదు చేసి ఇరువురిని అరెస్టు చేశామని ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు.

పోలీసులు పట్టుకున్న మద్యంతో నిందితులు

కేసు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

13 ఏళ్ల హత్య కేసు నిందితుల అరెస్టు

ప్రజాశక్తి కొయ్యూరు : మండలంలోని చల్దిగడ్డ గ్రామ శివారులో 2010లో జరిగిన హత్య కేసులో ముగ్గురు నిందితులను 13 సంవత్సరాల తరువాత పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని మంప పోలీస్ స్టేషన్ పరిధిలోగల బూదరాళ్ల పంచాయతీ పరిధి చల్దిగడ్డ గ్రామ శివారులో కొత్తపల్లి గ్రామస్తుడైన బొంజిబాబును, తూములోవ, చల్దిగడ్డ, కొత్తపల్లి గ్రామస్తులు ఆరుగురు కలిసి 2010లో హత్య చేశారు. ఆ కేసులో ఇప్పటివరకు ముగ్గురిని మాత్రమే అరెస్ట్ చేశారు. మిగిలిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేయవలసి ఉండగా కొయ్యూరు సిఐ స్వామి నాయుడు, మంప ఎస్సై లోకేష్ కుమార్, సిబ్బంది సహాయంతో గాలింపు చేపట్టారు. ఈ నేపథ్యంలో కొత్తపల్లి గ్రామానికి చెందిన గెమ్మిలి రాంబాబు, తూంలోవ గ్రామానికి చెందిన గెమ్మిలి బుజ్జి బాబు, అదే గ్రామానికి చెందిన పాంగి అప్పారావును తూర్పు గోదావరి జిల్లా తుని వద్ద గల ముక్కమల్ల గ్రామంలో పట్టుకున్నారు. వారిని కోర్టుకు తరలించి, వారిపై ఉన్న నాన్ బెయిల్ బుల్ వారెంట్‌ను మంగళవారం ఎక్జిక్యూట్ చేసి వారిని రిమాండ్‌కు పంపించటం జరిగిందని పోలీసులు తెలిపారు.

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శుభం బన్సల్

ప్రతి ఓటుపైనా సమగ్ర సర్వే

ప్రజాశక్తి - అడ్డతీగల : ఏజెన్సీలోని ప్రతి ఓటుపైనా ఇంటింటికి తిరిగి సమగ్ర సర్వే నిర్వహించాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మండలంలోని పోలింగ్ బూత్ లెవెల్ అధికారులకు ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన నిర్వహించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ లెవెల్ అధికారులందరూ తమ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి పాత ఓటర్లను గుర్తించడమే కాకుండా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి కొత్త ఓటు నమోదు చేయించాలని సూచించారు. 2024 జనవరి నాటికి 18 సంవత్సరాలు నిండే యువతీ యువకులకు కూడా కొత్త ఓట్లు నమోదు చేయాలని పేర్కొన్నారు. ఈ సమగ్ర సర్వేలో అధికారులు సిబ్బంది వాలంటీర్ వ్యవస్థను వినియోగించరాదని, ఎన్నికల కమిషన్ నియమించిన సభ్యులను మాత్రమే ఈ ప్రక్రియలో వినియోగించుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ తాతారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

హుదూద్ ఇళ్ల సమస్యపై సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హుదూద్ తుపాను సమయంలో ఇళ్లు కోల్పోయిన వారికి టిడిపి ప్రభుత్వ హయాంలో కొమ్మాది ప్రాంతంలో నిర్మించి, కేటాయించిన సుమారు 224 ఇళ్ళకు కనీస సదుపాయాలు కల్పించాలని కోరుతూ ఎంవిపి కాలనీలోని ఉషోదయ జంక్షన్‌లో వున్న హౌసింగ్ కార్పొరేషన్ వద్ద సిపిఎం ఆధ్వర్యాన మంగళవారం ధర్నా నిర్వహించారు.

పడకేసిన పారిశుద్ధ్యం

ప్రజాశక్తి-మారేడుమిల్లి

పది రోజుల నుండి ఎడతెరిపి లేకుండా మన్యంలో కురుస్తున్న వర్షాలకు పారిశుధ్యం పడకేసింది. దీంతో దోమలు విపరీతంగా పెరిగి మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, విష జ్వరాల బారిన ప్రజలు పడుతున్నారు. వర్షాకాలం ప్రారంభమై దాదాపు నెల కావస్తున్నా నేటికీ మండలంలోని అన్ని గ్రామాల్లో మలేరియా మందు స్ప్రేయింగ్ పూర్తిస్థాయిలో జరగలేదు. దీనికి తోడు గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. ఇప్పటికే ప్రతి ఇంట్లో ఒకరు ఏదో ఒక జ్వరంతో బాధపడుతున్నారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు ప్రైవేటు క్లినిక్ల వద్ద నిత్యం వందలాది మంది ప్రజలు క్యూ కడుతున్న పరిస్థితి ఉంది. మలేరియా, టైఫాయిడ్ కేసులు అక్కడక్కడ నమోదవుతున్నాయి.

పేరుకుపోయిన చెత్తా చెదారం

ముందుకు కదలని మురుగునీరు

మారేడుమిల్లి పంచాయతీ ప్రధాన రహదారి పక్కనే చెత్తచెదరాలు పెద్ద ఎత్తున పేరుకుపోయాయి. వర్షాలు విపరీతంగా కురుస్తుండడంతో వీధుల్లోని గోతుల్లో మురికి నీరు నిల్వలు పెరిగిపోయి దోమలకు స్థావరాలుగా మారుతున్నాయి. ఇదే విధంగా కొనసాగితే ఇప్పటివరకు అక్కడక్కడ వెలుగు చూస్తున్న మలేరియా, డెంగ్యూ కేసులు మరింత ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఇప్పటికైనా సంబంధింత అధికారులు పంచాయతీ సిబ్బంది స్పందించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

10 నుంచి విద్యుత్ ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 10 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపట్టనున్నట్టు ఎపి స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మంగళవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖలో 20, 25 సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గతంలో పాదయాత్ర చేసిన సమయంలో వీరందరినీ పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చారని, ప్రభుత్వం వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తయినప్పటికీ ఆ హామీని నెరవేర్చలేదని అన్నారు. విద్యుత్ ఉద్యోగులకు 2022 జులై 1 నుంచి ఉన్న డిఎ బకాయిలు చెల్లించాలన్నారు. 2019లో నియమితులైన వారందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఇతర ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేసి, ఎనర్జీ అసిస్టెంట్లను మాత్రం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కరోనా సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా 140 మంది ఎనర్జీ అసిస్టెంట్లు చనిపోయారని, వారి స్థానంలో కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేస్తున్న విధంగానే తమకు కూడా పెన్షన్ మంజూరు చేయాలన్నారు. సమ్మెకు వెళ్లే ముందు ఈ నెల 27 నుంచి ఆగస్టు 9 వరకు దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. దీనిలో భాగంగా ఆగస్టు 1న అన్నిచోట్లా ర్యాలీలు, 2, 3 తేదీలలో రిలే దీక్షలు, 4, 5, 7 తేదీలలో వర్క్ టు రూల్, 8న విజయవాడలో మహాధర్నా చేపడతామన్నారు. 9న డిపార్టుమెంట్ తమకు ఇచ్చిన సిమ్ కార్డులను తిరిగి వారికి అందజేస్తామన్నారు. 10 నుంచి నిరవధిక సమ్మెకు వెళతామని చెప్పారు. విద్యుత్ ఉద్యోగుల, కార్మికుల సమ్మె రాష్ట్ర ప్రజలందరికీ ఇబ్బంది కలిగించేదిగా ఉన్నప్పటికీ తప్పనిసరి పరిస్థితిలో సమ్మెకు వెళుతున్నట్లు తెలిపారు. పరిశ్రమలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. సమ్మె వల్ల పరిశ్రమలకు, ప్రజలకు కలిగే అసౌకర్యానికి ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో జెఎసి చైర్మన్ పి.చంద్రశేఖర్, కన్వీనర్ బి.సాయికృష్ణ, జెఎసి నాయకులు విఎస్ఆర్‌కె.గణపతి పాల్గొన్నారు.

ఎఐటియుసి జిల్లా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎఐటియుసి విశాఖ జిల్లా 13వ మహాసభలు ఆగస్టు 12, 13 తేదీలలో విశాఖపట్నం వేదికగా జరగనున్నాయని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బిసిహెచ్.మసేన్ తెలిపారు. మంగళవారం కొత్త రోడ్డు జంక్షన్‌లోని పోర్టు యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అదనపు కార్యదర్శి ఎం.మన్మథరావు, ఉపాధ్యక్షులు కె.సత్యాంజనేయ, ఎస్ఎ.రెహమాన్, పోతన్న, ఎపివి.శంకరన్, బాబు, ఎస్.రమణ పాల్గొన్నారు.

తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

పోలీసుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి - సీలేరు : ఈ నెల 28 నుంచి ఆగస్టు 3 వరకు మావోయిస్టు పార్టీ వారోత్సవాల సందర్భంగా ఆంధ్ర -ఒడిశా సరిహద్దుల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్‌పి, చింతపల్లి ఎఎస్‌పి ఆదేశాల మేరకు పోలీసులు మంగళవారం జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ బూసుకొండ గ్రామ పరిసర ప్రాంతాల్లో విస్తతంగా గాలింపు చర్యలు చేపట్టారు. జీకే వీధి సిఐ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో సిఆర్పిఎఫ్, స్పెషల్ పార్టీ, గ్రేహౌండ్స్ బలగాలతో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఆంధ్ర, ఒడిశా, చత్తీస్‌ఘడ్, తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల నుంచి వచ్చే పోయే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి, వివరాలు సేకరించి విడిచిపెట్టారు. అత్యాధునిక పరికరాలతో గురుకుల పాఠశాల కూసంత దూరంలో ఉన్న కల్వర్టు వద్ద గాలింపు చేశారు. ఈ సందర్భంగా సిఐ అశోక్ కుమార్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వారోత్సవాలు సందర్భంగా మావోయిస్టులు ఎటువంటి చర్యలకు పాల్పడినా తమ బలగాలు ప్రతిఘటించడానికి సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. రాత్రి సమయంలో కూడా తమ బలగాలతో స్థానిక లాడ్జిల్లో తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అపరిచిత వ్యక్తులు ఎవరైనా సంచరిస్తే తమకు తెలియజేయాలని కోరారు. మావోయిస్టు కదిలికలను పసిగట్టడానికి ఆధునిక పరిజ్ఞానం కలిగిన డ్రోన్ కెమెరాలు ఉపయోగిస్తున్నామని వెల్లడించారు. మండలంలోని దారకొండ, దుప్పిలివాడ, సీలేరు, గుమ్మరేవులు, గాలికొండ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న గ్రామాల్లో పోలీసు బలగాలు మమ్మల్ని తనిఖీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

పంటలను పరిశీలిస్తున్న అధికారులు

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-విఆర్.పురం : వ్యవసాయ సీజన్ ఆరంభమైన దృశ్య రైతాంగం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎన్ రఘుకుమార్ సూచించారు. మండలంలోని పెద్దమట్టపల్లి ఆర్‌బికె పరిధిలోని తమ్మయిపేట గ్రామంలో మంగళవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరినారు పోసే సందర్భంలో అన్ని మెళుకువలు పాటించాలన్నారు. ఈ యేడాది వరి సాగులో అధిక దిగుబడులు సాధించాలని కోరారు. సలహాలు, సూచనలు కావాలంటే స్థానిక ఏఇ కార్యాలయం సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

డంపింగ్ యార్డును తరలించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆరిలోవ ప్రాంత ప్రజల అనారోగ్యాలకు కారణమవుతున్న డంపింగ్ యార్డ్‌ను తక్షణమే మరోచోటకు తరలించాలని ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వై.రాంబాబు డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.